

# చలికాలం, ఒక మేఘం, అంతే కథ!





లోకేష్ మరణం దగ్గర మొదలు పెడదామనుకొని, లోపలేదో కదిలినట్లయి, గొంతుకలేవో పాడినట్లయి - కథను నేను హైదరాబాద్ స్టేషన్‌లో దిగిన క్షణం దగ్గరే మొదలు పెట్టడానికి నిర్ణయించుకొన్నాను.

నల్లని పెనుమబ్బు సినిమాల్లో చూసే స్పెషల్ ఎఫెక్ట్ దృశ్యంలా నగరాన్ని కప్పి వెయ్యటం చూసి నేను నివ్వెరపోయాను. యుద్ధం, మందుగుండు వాసన, పురాతనమైన గాయం, ఒంటరికోట, యోధుడి దిగులు లాంటి ప్రతీకలు ఎందుకో వెంటనే గుర్తుకొచ్చాయి. హైదరాబాద్‌లో నేను గడిపిన ఇరవైనాలుగు గంటలూ ఈ నల్లమబ్బు గురించిన పరిశోధనగానే మిగిలి పోయింది.

నిజానికి నేను హైదరాబాద్ వచ్చిన కారణం వేరు. ఒక ప్రియురాలికి లేదా ఫియాన్స్‌కి కానుకలేవో ఇచ్చి వెళ్ళడానికి అనే అతి మామూలు కారణం. ఖరీదైన 'ఫ్రెంచ్ సెంట్ బాటిల్', 'ఫెర్‌ఫ్యూమ్డ్ గార్డెన్' అనే ఎరోటిక్ కావ్యం, 'మారేజ్ అండ్ హిందూ సొసైటీ' అనే వ్యాసాల పుస్తకం - మూడింటినీ గిఫ్ట్ రేపర్‌లో చుట్టి - మోహిని అనే పేరున్న తన ప్రియురాలికి అందజెయ్యమని ఒక మిత్రుడు కోరితే - ఇన్నాళ్ళ తర్వాత ఒక విసుగులా, అయిష్టంగా హైదరాబాద్‌లో దిగాను.

ఉదయం ఏడుగంటలకు ట్రైన్ దిగానా, వాతావరణమంతా చీకటి చీకటిగా ఉంది. ప్లాట్‌ఫారమ్‌లో లైట్లు ఇంకా వెలుగుతున్నాయి. ఏమిటీ వింత అనుకొంటూ కిందకు దిగాను.

"లోకేష్! నీ మరణానికి మేం రోదించకూడదనుకొన్నాం.కానీ సాధ్యం కావటంలేదు" అంటూ ఒక ప్లేకార్డ్ పట్టుకొన్న అమ్మాయి ప్లాట్‌ఫాంపై మౌనంగా నడిచి వెళ్తోంది. చూస్తుండగానే ఆ అమ్మాయి ప్లేకార్డ్‌తో సహా గుంపులో మాయమైంది. క్షణాల్లో మళ్ళీ ఆ అమ్మాయే, అదే ప్లేకార్డ్‌తో మరో దిశలో వెళ్తుండటం కనిపించింది. ఆ అమ్మాయిని ఎక్కడో చూసినట్లుగా గుర్తు. గుర్తు చేసుకోవడానికి వీలులేకుండా లోకేష్ మరణవార్త గుండెపై దబ్బున తగిలింది. ఆ అమ్మాయిని ఆపి, 'నువ్వు లోకేష్ కూతురివా' అని అడగాలనిపించింది.

అయితే, ఈ లోపలే వెనుక నుండి జనం తోసేయటం మొదలు పెట్టారు. గేటు దగ్గర టికెట్ ఇచ్చిన తరువాతగాని ఆ మేఘాన్ని నేను గమనించలేదు. విశాలమైన మచ్చలా, అంత నల్లగా, అంత గాఢంగా మేఘం ఉండటం- నేను విస్తుపొయ్యాను. తుఫానో, భీకరమైన వర్షమో, మరింకే పెను విపత్తో -

వాటన్నిటికీ సూచికలా ఉందా మబ్బు. అయితే, మిగిలిన జనం ఎవరూ ఈ మేఘాన్ని పట్టించుకొన్నట్లు లేరు. అదో మామూలు విషయంలా యథావిధిగా సాగిపోతోంది జీవితం. స్టేషన్ బయట సిటీ బస్సులు బారులు తీరి నిలబడ్డాయి. ఆటోలు ముసిరిన కందిరీగల గుంపులా ఉన్నాయి. మెడలో డఫెల్ బాగ్, చేతిలో గిఫ్ట్ పాక్ - నేను బయట నిలబడి మేఘాన్ని చూస్తున్నాను. సామూహిక మరణాన్ని చూసినంతగా గుండె కలత చెందింది. "ఏమి మబ్బులివి? జగత్ పిత క్రోధాగ్ని కీలలా" అంటూ పాతకాలపు కవుల పద్యాలేవో గుర్తుకొచ్చాయి. అదో ముక్కలాగా, ఆకాశమంతా కాకుండా, కొద్ది ప్రదేశంలోనే, బహుశా హైదరా బాద్ పైనే నిలబడి ఉందేమోననిపించింది.

సూట్ వేసుకొన్న యువకుడొకడు నావైపు నడుచుకొంటూ వచ్చి "ఆర్ యూ న్యూ టు దిస్ సిటీ" అంటూ పలకరించాడు. నేనేం మాట్లాడకుండానే అతను చేతులు సాచి, "వెల్‌కం టు సైబర్ సిటీ. ఐ యామ్ ఆర్.వి. సాధినేని" అంటూ పరిచయం చేసుకొన్నాడు. "మైక్రోసాఫ్ట్ వాళ్ళ ఆథరైజ్డ్ ఏజన్సీ మాది. మా దగ్గర అన్నిరకాల సాఫ్ట్‌వేర్ పాకేజీలు దొరుకుతాయి. మా వెబ్ అడ్రసు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.సాధినేని.కామ్. గుర్తుంటుంది కదూ" అంటూ వెనక్కు తిరిగాడు. నలుగురు వస్తాదుల్లాంటి, రౌడీల్లాంటి కుర్రాళ్ళు చేతుల్లో సూదులు, ఏవో రంగుల యాసిడ్ బాటిళ్ళు పట్టుకొని నావైపు వచ్చారు. నేను ఉలిక్కిపడ్డాను. ఆ నలుగురూ నా చుట్టూ మూగి, "వాటీజ్ దిస్" అని అరు స్తుండగానే చొక్కా బటన్స్ పైకి తీసి, చొక్కా పైకి లాగి, ముంజేతిపై సూదితో 'పచ్చబొట్టు' (టాటూ), ఆకుపచ్చరంగులో డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.సాధినేని.కామ్ అంటూ పొడిచారు. భయంతో బిగుసుకుపోయాను. "సాధినేని అండ్ కో తరఫున ఇదో కాంప్లిమెంట్ సర్. నైస్ మీటింగ్ టు యు" అంటూ వస్తాదుల్లాంటి కుర్రవాళ్ళతో సహా ముందుకు కదిలాడా యువకుడు.

ఆశ్చర్యం నుండి తేరుకోక మునుపే, మరో యువకుడు నీట్‌గా టక్ చేసుకొని టై కట్టుకొని, "సర్! ఉయ్ ఆర్ ఫ్రమ్ వెబ్ పీపుల్. ఇన్ఫోటెక్ వాళ్ళ ప్రతినిధులం. లాప్‌టాప్‌లు, సర్వర్లు మా స్పెషాలిటీ" అన్నాడు. నేను అతనివైపు భయంగా చూస్తూ రెండు చేతుల్ని బిగించి పట్టుకొన్నాను. "హలో" అంటూ సన్నటి గొంతు వినబడింది. ఈసారి ఆడ వస్తాదులు. నా చొక్కా కాలరును వెనక్కు లాగి, వీపుపై సన్నగా పొడిచారు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.వెబ్‌పీపుల్.కామ్ అని. చిరునవ్వుతో "థాంక్యూ సర్" అంటూ ముందుకు కదిలారు. మరింక ఎటూ చూడకుండా రోడ్డువైపు నడక సాగించాను. రోడ్డు పైకి చేరే లోపల సుమారు పదిహేను చోట్ల నా శరీరంపై పచ్చబొట్లు పొడిచారు. నా శరీరం సొంత రంగును కోల్పోయి బొమ్మల మ్యూజియంలా తయారైంది. అప్పటికి

ఉదయం ఎనిమిది అయింది. క్రమంగా సూర్యుడు పైకి వచ్చి మబ్బు విడిపోతుందనుకొన్నాను. కానీ, అది మరింతగా చిక్కబడినట్లయి, నిరసనను సూచించే విశాలమైన నల్లజెండాలా నిలబడి ఉంది.

పేపర్ స్టాల్ వైపు వెళ్ళి 'లోకేష్ పత్రిక' అడిగాను. "ఈ వారం పత్రిక రాలేదు. ఈ ఒక్క షీటు మాత్రం ప్రింటు చేశారు" అంటూ ఒక పేపరు ఇచ్చాడు. ఆహ్లాదంగా నవ్వుతున్న లోకేష్ ఫోటో ఉంది అందులో. "లోకేష్ మరణం - ఒక నిజం, ఒక విషాదం" అని రాసి ఉంది ఫోటో కింద. చుట్టూ నల్లరంగు బోర్డర్. హఠాత్తుగా ప్లేకార్డు పట్టుకొన్న అమ్మాయి గుర్తుకొచ్చింది. లోకేష్ పర్సులో ఒకసారి ఆ అమ్మాయి ఫోటో చూశాను. అవే పోలికలు. ఎక్కడో జర్నలిస్టుగా పనిచేస్తుందని చెప్పాడు. పేపర్ చదువుతుండగా కాలిపై ఏదో పాకుతున్నట్లు తోచి - ఎవడో కింద కూలబడి కాలిపై పచ్చబొట్టు పొడుస్తున్నాడు. డబ్ల్యుడబ్ల్యు డబ్ల్యు.అల్ఫాబిరియాని.కామ్ అంటూ. అక్కడ నుండి పరిగెత్తుకొంటూ వెళ్ళి అయిదో నెంబరు బస్సు ఎక్కాను. బస్సు ఎక్కి మాసాబ్‌టాంక్ దగ్గరున్న వాతావరణ పరిశోధన సంస్థకు వెళ్ళాలని నా ఆలోచన. మబ్బు గురించి వాళ్ళేం చెబుతారో తెలుసుకోవాలని.

అయిదవ నెంబరు సిటీ లైనర్‌లో కూర్చుని కిటికీలోంచి నల్లమబ్బును చూస్తుండగా, బస్సు లోపల మసకమసకగా తోచి "లైటు వెయ్యకూడదా" అని లేడీ కండక్టరును అడిగి- లైటు వెలగ్గానే కళ్ళు జిగేలుమన్నాయి. ఏదో పౌరాణిక కాలంలోకి ప్రవేశించినట్లయింది. పక్క సీట్లో రవివర్మ పెయింటింగ్స్ లోని అమ్మాయిలాగా భారీ కాస్ట్యూములు, నగలు వేసుకొని ఒక అమ్మాయి కూర్చుని ఉంది. బహుశా టీవీ షూటింగ్‌కో, నాటకం రిహార్సల్‌కో వెళుతున్నట్లు ఉంది. "ఐయామ్ సీత. ఐ రిప్రజెంట్ ది ఫెమినైన్ క్యారెక్టర్ ఆఫ్ ది నేషన్" అని తనలో తాను గొణుక్కుంటోంది. బహుశా డైలాగులు ప్రాక్టీసు చేస్తోందేమో.

బస్సులో చిన్న మెరుపులు మెరిసినట్లయి, స్టేషన్‌లో ప్లేకార్డ్ పట్టుకొని నడిచిన అమ్మాయి కూడా కనబడి ఆశ్చర్యపోయాను. వాటర్ సినిమాలో షబానా ఆజ్మీలా తల నున్నగా మెరుస్తోంది. గంభీరంగా యుద్ధానికి తరలి వెళ్తున్న సైనికురాలిలా ఉంది.

"ఆర్ యూ చిత్రా" అన్నాను దగ్గరకు వెళ్ళి.

"నో. ఐ యామ్ సీత" అని నాలుక కరచుకొని నవ్వి, "ఐ యామ్ మోహిని" అంది.

మోహిని, మోహిని అంటూ నాలుగైదుసార్లు గొణుక్కొన్నాను. నేను వెతికే మోహిని, గిఫ్ట్‌పాక్ అందించాల్సిన మోహిని ఈవిడ కాదుకదా అనిపించింది. "ఆర్ యూ రిలేటెడ్ టు లోకేష్" అన్నాను. ఆమె గురించి తెలుసుకో

వాలనే పట్టుదలతో. తాను దిగాల్సిన స్టాఫ్ వచ్చినట్లుంది. ఆమె నవ్వుతూ "గుడ్ బై" చెప్పింది.

"ఐ యామ్ సీత...." రవివర్మ పెయింటింగ్‌లోని అమ్మాయి నోట్‌బుక్ తెరిచి డైలాగులు సీరియస్‌గా ప్రాక్టీసు చేస్తోంది. రవీంద్రభారతి స్టేజి దగ్గర ఆ అమ్మాయి లేచి నిలబడింది. ఆమె వెనుకనే మేకప్ బాక్స్ పట్టుకొని నడుస్తున్న కుర్రాడొకడు నావైపు తిరిగి, "సాయంకాలం రవీంద్రభారతిలో మా నాటకం ఉంది. మైథాజికల్ డ్రామా. మంచి కళాత్మక విలువలున్న నాటకం. యు ఆర్ వెల్‌కమ్" అంటూ చటుక్కున పెన్‌లాంటిదేదో పైకి తీసి నా ముఖంపై రాశాడు. మరో పచ్చబొట్టా అనుకొంటుండగా "డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.రామాయణం ఫర్ న్యూఏజ్.కామ్. మా వెబ్‌సైటది. మర్చిపోకుండా చూడండి" అంటూ ఆ అమ్మాయితో పాటు అదృశ్యమయ్యాడు.

బస్సు మాసాబ్‌టాంక్ వైపుగా వెళ్తోంది. రోడ్డంతా వాహనాలు కిక్కిరిసి ఉన్నాయి. మాటిమాటికీ కిటికీలోంచి బయటకు చూస్తున్నాను. నల్లమబ్బు అడవిదున్నల గుంపులా వెంటాడుతూనే ఉంది. చుట్టుపక్కల ఎవరికీ దీన్ని గురించి పట్టినట్టులేదే అనిపించింది.

"ఈ మబ్బు చూశారా! భయం గొలిపేలా..." పక్కనున్న మనిషిని పలకరించాను. అతనేం మాట్లాడలేదు. అతన్ని కాదన్నట్టుగా ఎటో చూస్తున్నాడు. రెండు నిమిషాలయినాక, "అంతగా పరేషాన్ అవడానికేముంది? ఈ కాలంల మబ్బులిలాగే ఉంటాయి" అన్నాడు తాపీగా.

"కానీ, ఇట్లా నల్లగా, కారుమబ్బులా, అదీ ఒక్క హైదరాబాద్ పైనే..." అన్నాను. అతను నావైపు అసహనంగా చూశాడు.

వాతావరణ పరిశోధన సంస్థలోనూ ఇదే పరిస్థితి. డైరెక్టర్ నావైపు వింతగా చూశాడు. "వాటీజ్ గ్రేట్ వండర్ ఇన్ ఇట్! మబ్బులు లేకపోతే, ఎండలు ఎక్కువయితే కంగారుపడాలి గానీ... ఇవి మామూలు మబ్బులు. వేపరైజేషన్‌తోటి... చిక్కబడి..." ఆయన మబ్బులు ఏర్పడ్డం గురించి చెప్పటం మొదలుపెట్టాడు. నేను లేచి నిలబడి ఆయన దగ్గర సెలవు తీసుకొని బయలు దేరుతుండగా వెనక్కు పిలిచాడు. "ఈ మబ్బుల గురించిన వివరాల కోసం ఒక అధికారిక వెబ్‌సైటు ఏర్పాటు చేశాము. దాన్ని ఓపెన్ చెయ్యండి. కొన్ని వివరాలు తెలుస్తాయి" అంటూ ఒక కార్డు నాకు ఇచ్చాడు. కార్డుపై డబ్ల్యుడబ్ల్యు డబ్ల్యు.నల్లమబ్బు.కామ్ అని రాసి ఉంది. ఆ వెబ్‌సైటు అడ్రసు దొరికినాక నాకు కొంచెం ఉత్సాహం కలిగింది. హుషారుగా రోడ్డుపైకి వచ్చాను.

మళ్ళీ బస్సు ఎక్కి - బస్సు లకిడీకాపూల్ దాటి మరింక ముందుకు వెళ్ళలేకపోయింది. ముందు రోడ్డుపైన ఒక పెద్ద ఊరేగింపు. గొడవ గొడవగా కోరస్ సాంగ్‌లా ఉంది. గంధపు మంటలా ధగధగమంటోంది.

"లోకేష్ అమర్ రహే" అనే నినాదం వినబడి, ఉలిక్కిపడి బస్సు దిగి అటువైపు నడిచాను. టాటా సుమోపై లోకేష్ శవాన్ని ఉంచి చుట్టూ పూల గుచ్ఛాలు పేర్చారు. బుట్టలతో పూలు వెదజల్లుతున్నారు వందలాది కుర్రవాళ్ళు. జాతరలా ఉందా ప్రదేశం. రోడ్డుపై వాహనాలన్నీ ఆగిపోయాయి. షాపుల్లో వాళ్ళు షట్టర్లు మూసేసుకొంటున్నారు. డప్పుపై మోగుతున్న శబ్దం సాయంతో ఒక పాటగాడు దుఃఖపు పాట పాడుతున్నాడు. ఆ పాటకు గుండెలు అలిసి పోతున్నాయి. నెత్తురు మరిగిపోతోంది. శరీరంపై గాయమేదో తిరిగి తెరుచుకొని రక్తం రక్తంగా, తడితడిగా -

దుఃఖమా? ఆవేశమా? ఏమిటి దీని పేరు? తట్టుకోలేనంత వేడి. నిప్పుల మధ్య నడుస్తున్నట్లుగా ఉంది ఊరేగింపులో నడుస్తుంటే.

ఊరేగింపు వెంట నడుస్తున్నా నల్లమబ్బు గురించిన ఆలోచన మాత్రం నాలోంచి తొలగిపోలేదు. దుఃఖంలా, విపత్తులా ఉన్న ఈ పెనుమేఘం గంట గంటకీ నల్లగా, చిక్కనవుతూ - నిజానికి లోకేష్ మరణానికి, ఈ నల్లమబ్బుకి ఏదో సంబంధం ఉండి ఉంటుందనిపించింది. పురాణకాలంలోలాగా, మహా పురుషుడి మరణానికి ప్రకృతంతా విలపించినట్లుగా, ఊరేగింపు గంధపు దీపంలా రోడ్డుపై మహా క్రోధంగా ప్రవహిస్తున్నట్లుగా అనిపించసాగింది. ఊరేగింపు కదులుతుండగా, ఒక ప్రదేశంలో నాలుగైదు బూడిదకుప్పలు కన బడ్డాయి. జనం ఆగారు. ఎవరో అరిచారు. "లోకేషన్న దిష్టిబొమ్మను తగల బెట్టింది ఇక్కడే. షాపులపై రాళ్ళు వేసి, వాళ్ళు దొమ్మీ చేసింది కూడా ఇక్కడే. ఇక్కడి నుంచే అరుచుకొంటూ, కేకలు వేసుకొంటూ లోకేషన్న ఆఫీసు వైపు పరిగెత్తుకొంటూ వచ్చింది. ఆఫీసులో ఉన్న డెబ్భయ్‌వేల లోకేష్ పత్రికల్ని రోడ్డుపైకి విసిరేసి వాటికి నిప్పు పెట్టింది ఈ స్థలంలోనే. ఇక్కడే ఇక్కడే" ఒక కుర్రవాడు పెద్దగా అరిచాడు. క్షణంసేపు ఊరేగింపులో నిశ్శబ్దం.

"అక్షరాలు తగలబడింది ఇక్కడే. మన స్వేచ్ఛ, మన ఆలోచన, మన హేతువు తగలబడింది ఇక్కడే" ఎవరో అమ్మాయి నినాదంలా అరిచింది. అటువైపు తిరిగి చూశాను. నున్నగా మిలమిలలాడుతూ బోడిగుండుతో ఉన్న అమ్మాయి వేన్ ముందు శవంపై చెయ్యివేసి - మోహిని మరోసారి ప్రత్యక్ష మైంది.

కొన్ని క్షణాల నిశ్శబ్దం ముగిసింది. మళ్ళీ నినాదాలు, కేకలు. గాయపడ్డ పాటగాడి దుఃఖం, క్రోధం. ఊరేగింపు కదిలింది. గంధపుచెక్కల మంటలా రోడ్డుపై ధగధగమని పాకుతూ వెళ్తోంది ఊరేగింపు.

"ఇదంతా ఆయన రాసిన సంపాదకీయం వలనా? ఆయన మాత్రం ఏం రాశాడు. మళ్ళీ వెనక్కు, పాత రాతియుగంలోకి ప్రయాణమా అని ప్రశ్నించాడు. అంతే" ఊరేగింపులో ఎవరో గుసగుసలాడారు. డప్పు వాయించే కుర్రాడు అటువైపు కోపంగా చూసి, మళ్ళీ జనక్ జనక్ మంటూ డప్పును లంకించుకొన్నాడు. "పాతికేళ్ళ జర్నలిస్టు జీవితం. రచయితగా దేశం మెచ్చినవాడు. లోకేష్ పత్రిక, జర్నలిజంలో కొత్తదారి చూపింది. నిర్భయం, పరిశోధనలకు అది నిర్వచనం. అతడెన్నడూ, దేనికీ బెదిరిపోలేదు. ఇవాళ ఇట్లా గుండె ఆగిపోవటం – ఇదొక సింబాలిక్ మరణం. మనం పోగొట్టుకొంటున్న భావస్వేచ్ఛ గురించి తొలి హెచ్చరిక!" ఊరేగింపు మధ్య నుండి ఒక వృద్ధుడు ఉద్రేకంగానే చెప్పుకుపోతున్నాడు.

హఠాత్తుగా ఒక జ్ఞాపకం గుండెను కదిపి –

పాలిపోయిన ముఖం, మీసాలు, గుబురుగడ్డం గుర్తుకొచ్చాయి. ఖద్దరు లాల్చీ, దానిపైన జాకెట్ లాంటిది. గిరజాల జుట్టు – లోకేష్ ఆకారం ప్రత్యేకంగా ఉండేది. నాటకాల్లోని పాత్ర స్టేజిపై నుంచి నడిచివచ్చినట్లుగా ఉంటుంది. అతని భుజానికో గుడ్డ సంచి ఉండేది. అందులో పేపర్ కటింగ్స్, కొత్తగా వచ్చిన కవితా సంకలనాలు, ఆయన కవితలు – చిత్తు కాగితాల్లో రాసి, నాలుగైదు మడతలు వేసి – కాఫీ తాగుతూనో, కబుర్లు చెబుతూనో ఆ కాగితాల్ని బయటకు తీస్తాడు. శ్రావ్యమైన కంఠం.

మొదటిసారి ఆయన్ను కలవటం జైలు గదిలో.

లోకేష్ పత్రికను నిషేధించాలని ప్రభుత్వం – ఆయన ఆమరణ నిరాహారదీక్ష – బలవంతంగా హాస్పిటల్‌కు తీసుకెళ్ళి సెలైన్ ఇచ్చి, తరువాత సెల్లో వేశారు.

ఆయన అరెస్టుకు నిరసనగా బంద్, ఊరేగింపూ – పోలీసులు మమ్మల్ని వేన్‌లో ఎక్కించారు.

ఆయన్ని చూడటం అదే మొదటిసారి. "ఆయనే లోకేష్" అన్నారు ఎవరో. "మార్నింగ్ సార్!" అన్నాను. ఆయనేం మాట్లాడలేదు. కిందకు వంగి, నేల పై పాకుతున్న చీమను చూసి, "గుడ్‌మార్నింగ్, గుడ్ డే, ఆల్ ది బెస్ట్ ఫర్ ఎవర్" అని మావైపు చూసి, "నేను కీటకాలకు, జంతువులకు తప్ప మనుషులకు తల వంచను. విష్ చెయ్యను" అన్నాడు. "ఆయన కాస్త డిస్టర్బ్ అయ్యాడు" మిత్రుడు సంజాయిషీలాగా చెప్పాడు.

మౌనవ్రతం పట్టినవాడిలా ఉన్నాడు ఆ రోజంతా. ఉండీ ఉండీ ఏదో గుర్తుకొచ్చినవాడిలా, "మనం మనుషులమేనా" అని ప్రశ్నించేవాడు.

ఆయన ఆలోచనల్ని డైవర్టు చెయ్యాలని, "చెస్ ఆడదామా సార్" అన్నాను.

"చెస్ ఆడటం ద్వారా మనం మనుషులమని నిరూపించుకోవచ్చా" అన్నాడు నావైపు తీక్షణంగా చూస్తూ.

"తినటం, తాగటం, నిద్రపోవటం, సెక్స్‌లో పాల్గొనటం - ఇవేనా మనం మనుషులం అనిపించుకోవడానికి లక్షణాలు" అనేవాడు కోపంగా.

ఇంకోసారి కూడా ఇలాంటి సందర్భంలోనే కలిశాడు.

అసెంబ్లీ ముందు ధర్నా ప్రైవేటీకరణపై. లాఠీఛార్జీ జరుగుతోంది. పొడవాటి లాల్చీ, భుజంపై గుడ్డ సంచీ - ఆయన్ను గుర్తుపట్టాను. ఆయనపై లాఠీదెబ్బ పడకుండా ఆయన్ను పక్కకు లాగాలని ఆయనవైపు పరిగెత్తాను. సంచిలోంచి కెమెరా తీసి లాఠీఛార్జీ చేస్తున్న పోలీసుల్ని, చెదిరిపోయి పరిగెడుతున్న జనాన్ని ఫోటోలు తియ్యటం మొదలుపెట్టాడు. నేను చెప్పినా వినిపించుకోలేదు. ఫట్‌మంటూ ఆయన తలపై తగిలింది లాఠీ. పక్కకు తూలి పడబోయాడు. ఆయన్ను రెండు చేతుల్తో పట్టుకొని ఒక మూలకు పరిగెత్తాను. తలపై నుండి సన్నటి రక్తపు ధార.

"భూమిపైనా, ఆకాశంలోనూ అది ధ్వనిస్తుంది" అంటూ కవితను ఆశువుగా చెప్పటం మొదలుపెట్టాడు. తలపైనున్న రక్తాన్ని చేతితో అద్దుకొని, ఎర్రగా అయిన చేతిని చూస్తూ -

"నా తలలో వేయి చేతులు. ఒక్కో చెయ్యి ఒక పొయమ్‌ని రాస్తూ" అన్నాడు. కొద్దిగా కంగారు వేసింది. "కంగారు లేదులే. మతి చెడలేదు" అని నవ్వి, జేబులోంచి సిగరెట్ ప్యాకెట్ తీసి వెలిగించి, ఒక చిత్తు కాగితంలాంటి కాగితం ఇచ్చి, "చదువు. వింటుంటే కాస్త ఊరటగా ఉంటుంది" అన్నాడు.

ఆ దృశ్యం చాలా అబ్సర్డ్‌గా ఇంకా నాకు గుర్తుంది. బయట లాఠీఛార్జీ, పోలీసులు మౌత్‌పీసుల్లోంచి కేకలు వేస్తున్నారు. జనం అటూ ఇటూ పరుగెడుతున్న చప్పుడు. ఈ మనిషి ఒక గోడ పక్కన కూలబడి, ఒక పొయమ్ చదవమని ఆర్డర్ వేస్తున్నాడు.

*శిరస్సు తెగిపోతుంది, గాలిలోనో*
*ఆకాశంలోనో, భూమిపైనో*
*అట్లా వేలాడుతూనే ఉంటుంది*
*అరుస్తుంది, కేక వేస్తుంది*
*ధ్వనిస్తుంది, ప్రతిధ్వనిస్తుంది*
*శిరస్సు అట్లా వేలాడుతూనే ఉంటుంది*
*దాని కేక వెంటాడుతూనే ఉంటుంది -*

మరింక చదవలేకపోయాను. ఆ వాతావరణం, అట్లా పొయమ్ చదవటం, నాకు ధైర్యం చాలలేదు. ఆయన్ను లేవదీసి, "ఇంక వెళ్దాం సార్" అన్నాను. అభ్యంతరం చెప్పకుండా మౌనంగా నా వెంట నడిచాడు.

దృశ్యాలు, జ్ఞాపకాలు, వెంటాడే కంఠస్వరం. రోడ్డుపైన ఎవరో నిలబడి – పొడవాటి మనిషి, లాల్చీ, ఖద్దరు సంచి – పొయమ్ చదువుతున్నట్లు. బిగ్గరగా వీధంతా వినబడేలా.. మృదువుగా, మంద్రంగా, హఠాత్తుగా పెనుకేకలా వినబడే స్వరం – లోకేష్.

ఊరేగింపు ఉగ్రంగా ఉంది. సామూహిక కవితా పఠనంలా ఉంది. ఊరేగింపు అట్లాగే అంబేద్కర్ విగ్రహం దాకా సాగింది. భుజానికి డఫెల్ బాగ్, చేతిలో అజ్ఞాత ప్రియురాలి కోసం తెచ్చిన గిఫ్ట్‌పాక్‌తో సహా నేను.

హఠాత్తుగా పైకి చూశాను. పైన నల్లమబ్బు అట్లాగే క్రూరంగా నిలబడి ఉంది. "ఈ మబ్బుకు, లోకేష్ మరణానికి లింక్ ఏమైనా ఉందా."

సీరియస్‌గా పక్కనున్న వ్యక్తిని అడిగాను. అతను కోపంగా నావైపు చూసి, "వాట్ నాన్సెన్స్! ఇట్లాంటి సూపర్‌స్టిషన్ అంటే లోకేష్‌కి అసహ్యం! ఏ కాలంలో ఉన్నారు మీరు? చలికాలంలో మబ్బులు రాకుండా ఉంటాయా" అని విసుక్కొన్నాడు.

ఆయనట్లా నన్ను విసుక్కొంటున్నప్పుడే దూరంగా నాలుగైదు పోలీసు ట్రక్కులు, అందులోంచి దిగుతున్న యూనిఫారాల పోలీసులూ కనబడ్డారు.

"ఊరేగింపులు నిషేధించాం! శాంతిభద్రతల దృష్ట్యా రెండు వారాల పాటు నగరంలో ఊరేగింపులకు అనుమతించేది లేదని సి.పి ఆర్డర్ వేశారు. వెళ్ళండి. అందరూ డిస్‌పర్స్ అవ్వండి. కావాలంటే శవం తాలూకు బంధువులు మాత్రం మౌనంగా రోడ్డుపై నుండి వెళ్ళవచ్చు."

వింటారా. అంత కోపంగా, అంత చండ్రప్రచండంగా మండుతున్న కుర్రవాళ్ళు వింటారా?

అరుపులు, కేకలు, నినాదాలు – ఫటాఫట్ మంటూ లాఠీలు విరిగాయి. దెబ్బలయినా తింటున్నారు గానీ జనం మాత్రం చెదిరిపోవటం లేదు. రక్తపు మంటలా ఉందా ప్రదేశం. ఇదంతా పైన నల్లటి కారుమబ్బు ముసిరిన సమయంలోనే జరిగింది. రెంటికీ ఏదో సంబంధం ఉందన్న ఒక మెటాఫిజికల్ భ్రాంతి నన్ను వదలడం లేదు.

అప్పుడు వేన్ పక్కన ఉన్న అమ్మాయి లోకేష్ కూతురో, లేదా మోహినో, మిలమిలలాడే గుండుతో ఉన్న అమ్మాయి – ముందుకు నడిచి, ఎదురుగా ఉన్న అంబేద్కరు విగ్రహానికి నమస్కారం పెట్టి – "ఇక్కడే దహనం చేద్దాం. ఇంతకన్నా పవిత్రమైన స్థలం ఈ భూమిపైన ఎక్కడుంటుంది" అని అరిచింది.

పోలీసులు క్షణంసేపు ఉలిక్కిపడ్డారు. వాళ్ళు తేరుకొనే లోపలే ఒక మహాజ్వాల లేచింది. గంధపు చెక్కలు పేర్చిన వేన్‌తో సహా దహనం అవు తున్నాడు లోకేష్. శబ్దాలన్నీ ఆగిపోయి ఒకే ఒక్క పాట. పాటలమనిషి డప్పు అందుకొని గద్దర్ బాణీలో, సన్నగా చిందువేస్తూ, కన్నీళ్ళు కారుతుండగా పాడిన పాట. పాట కూడా మండుతుందని తెలిపిన ఆ మధ్యాహ్న సమయం -

పోలీసులు సాక్షిగా అక్కడో సాంస్కృతిక మేళా మొదలైంది.

తల పైకెత్తి చూశాను. దట్టమైన గుబురు అడవిలా పైన అల్లుకొని ఉంది మేఘం. నల్లగా కమిలిన ఆకులు వరుసగా పేర్చినట్లుగా ఉందా మేఘం. చీకటి అడవిలో మండుతున్న ఒకే ఒక్క నెగడు లాంటి ఆ స్థలాన్ని వదిలి మెల్లగా ముందుకు కదిలాను. భుజాన డఫల్ బ్యాగ్, చేతిలో గిఫ్ట్ రేపర్ చుట్టిన పార్శిల్.

గ్రామర్ స్కూలు మలుపు దగ్గర శివరావు కనిపించాడు. శివరావు కనబడ్డంతోనే నాకు కొంత ఉల్లాసం - ఏ విషయాన్నైనా లాజికల్‌గా చర్చించి వివరించగలవాడు. నల్లమబ్బు గురించిన చిక్కు ఆయన విప్పగలడనిపించింది.

రోడ్డుపైన ఖాళీ గోడలపై వీధి పిల్లలతో బొమ్మలు వేయిస్తున్నాడాయన. ఆ పిల్లలు, ఆ దృశ్యం ఎంతో ఫోటోజెనిక్‌గా ఉంది. మొత్తం పన్నెండు మంది. మసకమసగ్గా ఉన్న వాతావరణంలో, రంగులు, కుంచెలతో గోడలను వర్ణ మయం చేస్తున్నారు. పదమూడో పిల్ల పెట్రోమాక్స్ లైటును ఎత్తి పట్టుకొని నిలబడింది. వెలుగు ప్రసరించే దేవతలా - శివరావు వాళ్ళ మధ్య నిలబడి సలహాలిస్తున్నాడు.

వెళ్ళి ఆయన వెనక నిలబడ్డాను. "నాతో ఏ విషయం గురించి చర్చించా లనుకొంటున్నావు" అన్నాడు ఏ ఉపోద్ఘాతం లేకుండానే. "ఈ పదమూడో పిల్ల గురించి, ఇట్లా పగటిపూట వెలుగును పిండుకోవాల్సిన పరిస్థితి గురించి, ఈ నల్లమబ్బు గురించి" అన్నాను.

"దేనికైనా ఒక కారణాన్ని వెతికితే గాని నిద్రపట్టదా మీకు? దేనికదే ఒక అనుభవంగా ఎందుకు తీసుకోరు? ఈ మబ్బును ప్రకృతి వైపరీత్యంగా లేదా ఆకాశం చేసుకొన్న ఒక అలంకారంగా ఎందుకు తీసుకోకూడదు" అన్నాడు.

నా ముఖంలో నిరుత్సాహాన్ని దాచుకోలేకపోయాను. అప్పుడు ఆ పదమూడో పిల్ల నావైపు ఓదార్పుగా చూసి, లైటు నావైపుకు తిప్పి, కాంతి నా ముఖంలో పడుతుండగా, "అంకుల్! నేను చెప్తాను. చాన్నాళ్ళ క్రితం మన ఊళ్ళో గొడవలయినాయి కదా. అందులో ఇళ్ళు తగలబడి, మనుషులు చచ్చి పోయి - మా ఈడుది షాజహానా వాళ్ళ అమ్మానాన్నలు అట్లాగే చనిపోయారు-

అట్లా చనిపోయిన వాళ్ళ ఆత్మలన్నీ ఆకాశంలో తిరుగుతూ, మబ్బుల్లా గడ్డ కట్టి..."

ఆ పిల్ల ఇమాజినేషన్‌కు నేను అబ్బురపడిపోయాను. ప్రేమగా ఆ పిల్ల బుగ్గలు నిమురుతుండగా వాళ్ళలోంచి ఒకటోవాడు పరుగెత్తుకొంటూ వచ్చి, "ఆగండి సార్" అంటూ దగ్గరగా వచ్చి బ్రష్‌తో నా చెంపపై వారిస్తున్నా వినకుండా రాశాడు. రాసినాక తృప్తిగా చూస్తూ, "డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.వీధిబడి.కామ్ సార్! మా శివరావు సార్ ఉపన్యాసాలు ఉంటాయి అందులో" అన్నాడు. కొంచెం కంగారుతో అడుగు ముందుకు వేశాను.

రోజులో చాలాభాగం గడిచిపోయింది. మెల్లగా ఆకలి మొదలైంది. కొత్త చీకటి కొద్దికొద్దిగా అలవాటు పడుతోంది. మబ్బు గురించిన రహస్యపు ఆలోచనలతో అట్లాగే నడుస్తూ వెళ్ళాను రోడ్డుపై.

'దేశీ టవర్స్' అనే సైన్ బోర్డు కనబడి టక్కున ఆగిపోయాను. నా మిత్రుడు ఇచ్చిన అడ్రస్ అదే. అడుగు పెడుతుండగానే ఒక వింత వాసన. "సిద్ధాంతానికీ ఒక వాసన ఉంటుంది. ముఖ్యంగా గాఢమైన సిద్ధాంతానికి. బిగుసుకుపోయిన ఇనుము, రీడ్స్‌పై దుమ్ముపట్టి పలకటం ఆగిపోయిన పియానో, తడిసి, వెలిసిపోయిన జెండాలు, నిస్ప్రాణంగా నేలకడ్డంగా పడిపోయిన ఉద్యమం - వీటన్నిటికి ఒక వింతవాసన ఉంటుంది" అంటాడు ఎమ్మెస్, అదే మోహిని ఫియాన్సీ. అట్లాంటి వాసనేదో ఈ దేశీ టవర్స్‌లోంచి గుప్పు మన్నట్లుగా, నా భ్రమేమో? చాలా ఏళ్ల క్రిందట కట్టిన అపార్ట్‌మెంట్స్ అవి. బీటలువారి మురుగు, పాచి పట్టి, పురాతనమై.... ప్రాచీనత్వం తాలూకు వాసనా?

అపార్ట్‌మెంట్స్ ముందర ఖాళీ స్థలంలో కుర్రవాళ్ళు క్రికెట్ ఆడు తున్నారు. అపార్ట్‌మెంట్లలోంచి టీవీల చప్పుడు. వెళ్ళి తలుపు తట్టాను. తలుపు తెరుచుకోలేదు. కిటికీలోంచి లోపలికి చూశాను. పెద్ద కళేబరంలా ఉంది అపార్ట్‌మెంట్. కళేబరంలోంచి ఏదో పైకి లేస్తున్నట్లుగా, తలుపు తెరుచుకొని ఒక లావాటి యాభై ఏళ్ళ శరీరం బయటకు తొంగి చూసింది.

"మోహిని, మోహిని కోసం..." అన్నాను.

"ఎన్నో కృష్ణుడివి! నాలుగా, అయిదా" అంది జుగుప్సగా ముఖం పెట్టి.

నాలుకెండిపోయింది నాకు. "కాదు, గిఫ్ట్ పాక్ ఇచ్చి వెళ్దామని."

అపనమ్మకంగా చూసింది నావంక. నిప్పుల గుండంలా ఊఁహూఁ! కాలుతున్న కళేబరంలా ఆమె. నేనేం మాట్లాడలేదు. "పూటకో స్నేహితుడు! ఇట్లాంటి వేషాలిక్కడ చెల్లవు. నా ఫ్రెండ్స్ అంటూ నీలుగుతుంది ఆవిడ.

ఫ్రెండ్స్ ఏమిటి ఫ్రెండ్స్. ఆడదానికి మొగుడొక్కడే ఫ్రెండ్. తాళిబొట్టు గుట్టు, మట్టు."

"ఫో! అపై అపార్ట్‌మెంటులో ఉంది. వెళ్ళు. వెళ్ళి చెప్పు. ఇట్లాంటి నకరాలు ఇక్కడ చెల్లవని. అదేమిటి ఫెమినిజమా, గిమినిజమా. అట్లాంటివేమీ చెల్లవని చెప్పు. మొన్న ఒట్టి వార్నింగే ఇచ్చాను. ఈసారి ఏకంగా జైల్లోనే పెట్టిస్తానని చెప్పు."

మహా నియంతలా గర్జించింది.

"ఫౌల్, ఫౌల్" దూరం నుంచి ఆటల మధ్య పిల్లల అరుపులు.

మొదటి అంతస్తుకు దారితీసే మెట్లు.

చీకటిగా ఉంది. భయంకరమైన దుర్గంధం. మూత్రం, పాసిపోయిన ఆహార పదార్థాలు - ఊడ్చిన చెత్తంతా ఒక మూలన. గోడలకు వేసిన రంగు వెలిసిపోయి - పెట్లిపోయి భయం కలిగించేలా ఉంది. బూతు సినిమా పాట ఒకటి కిటికీలోంచి బయటకు తోసుకువస్తోంది. పోట్లాడుకొంటున్న రెండు గొంతుకలు (ఆడ, మగ) కిటికీలోంచి బయటకు రావడానికి ప్రయత్నిస్తున్నాయి.

బయట ఆకాశంలో నల్లమబ్బు ముసిరే ఉంది. మహా ప్రమాదంలా చీకటిగా ఉంది. సాయంకాలమో, రాత్రో తెలియట్లుగా ఆఫీసులకు వెళ్ళే మగ వాళ్ళు, వంటగదుల్లో మగ్గే ఆడవాళ్ళు, రిక్షాల్లోను, ఆటోల్లోను స్కూళ్ళకు పరిగెత్తే పిల్లలు - సినిమాలో ఫాస్ట్ ఫార్‌వర్డ్ దృశ్యంలా - ఒక్కసారిగా సంవత్స రాలు ఇవాళ దగ్గర ఫ్రీజ్ అయినట్లు అందరి ముఖాలపై నల్లగా, భయంలాంటి భావన పులమబడినట్లు - అట్లా రోడ్డుపైకి చూస్తే మనుషులు కాకుండా నల్లటి బొగ్గు గీతలు అటూ ఇటూ కదులుతున్నట్లు.

గది ముందు ఆగి తలుపు తట్టాను. ఎర్రటి టెర్రకోట బొమ్మలా మోహిని.

ఉదయం నుండి చాలాసార్లు చాలా సమావేశాల్లో చూశానా అమ్మాయిని.

"లోపలికి రండి" అంటూ నడిచింది. ఎమ్మెస్ పంపిన గిఫ్ట్ అంటూ పాకెట్ ఆమె చేతికి అందించాను. దాన్ని తీసుకొని, విప్పకుండా బల్లపై పెట్టింది. కాఫీ తెస్తానని లోపలికి వెళ్ళింది.

చాలా మౌనంగా, అసహజంగా ఉంది వాతావరణం.

అర్థం లేని చెత్త ఏదో మాట్లాడటం మొదలుపెట్టాను. తాను వింటు న్నట్లు లేదు. పక్క అపార్టుమెంట్ వాళ్ళ పిల్లలు కాబోలు, వాళ్ళు గదుల్లో అటూ ఇటూ నిర్భయంగా తిరుగుతున్నారు.

ఆ పిల్లలు ఒక గదివైపు వెళ్ళి, తలుపు తెరిచి, తొంగి చూసి, గుసగుస లాడుకొని, మళ్ళీ వెనక్కు పరుగెడుతున్నారు.

అట్లా చాలాసార్లు చేశారు.

ముందు అదో ఆట అనుకొన్నాను. కానీ, వాళ్ళ ముఖంలో ఆట తాలూకు ఉత్సాహం లేదు.

"ఏముంది ఆ రూములో...?" ఆమేం మాట్లాడలేదు. నేను లేచి ఆ గది వైపు వెళ్ళాను.

తలుపు తెరిచి, క్షణంపాటు షాక్ లాంటి స్థితిలోకి వెళ్ళాను.

గది ఇరుకు ఇరుకుగా ఉంది. రెండు విశాలమైన చాపలు, వాటిపై దుప్పట్లు, దిండ్లు, ఒక చాపపై వార్తాపత్రికలు, మాగజైన్‌లు అటూ ఇటూ పడేసినట్లుగా, టేప్ రికార్డర్, దాని పక్కనే క్యాసెట్లు, గోడనిండా పోస్టర్లు బొమ్మలు - గోడపైన ఒక మూలన వెలిసిపోయిన జెండా, ఏ పార్టీదో తెలియటం లేదు. గోడకింకో వైపు పొడవాటి పోస్టర్ - వాటర్ కలర్స్‌తో వేసింది - ఒట్టి తల మాత్రం ఉంది. గడ్డం, బండ పెదాలు, కారికేచర్ లాంటిది - వాటన్నిటి మధ్య నిర్జీవంగా పడి ఉన్న మనిషి శరీరం - మామూలు మనిషి కాదు, మహా కాయుడు. తల ఒక గోడకు, కాళ్ళు మరో గోడకు తగిలేలా - ఏళ్ళ క్రితం ఎప్పుడో చనిపోయినట్లు - దుమ్ముపట్టి - శిథిలమై - భయంతో కేక వేశాను.

"ఏమైంది" అంటూ కంగారుగా వచ్చింది మోహిని. క్షణంసేపు నిశ్శబ్దం. ఇందాక కనిపించిన పొడవాటి మనిషి దేహం అక్కడ లేదు. కానీ, మిగతా దృశ్యం - పరిచిన చాప, నలిగిన దుప్పటి, టేప్ రికార్డర్, పేపర్లు, గోడపై పోస్టర్లు, పోస్టరులోని బొమ్మలో పోలికలు ఇప్పుడు స్పష్టంగా తెలుస్తున్నాయి. గద్దర్‌లాంటి, ఉద్యమాలకు పాటలు పాడే ఒక గాయకుడి పోలికలున్నాయి.

"ఇది మా నాన్న గది."

నర్వస్‌గా ఉందామె ముఖం. ముఖంపై పట్టిన చెమటను కొంగుతో తుడుచుకొంటూ అటూ ఇటూ సీలింగ్ వైపుకో, గది వైపుకో చూసింది. ఎందుకో సారీ చెప్పాలనిపించింది. "సారీ" అన్నాను సానుభూతితో.

కిటికీలోంచి బయటకు చూస్తోంది. చాలాసేపు నేను అట్లాగే తలుపు దగ్గర నిలబడ్డాను. మధ్యలో పిల్లవాళ్ళు రెండుసార్లు వచ్చి తొంగిచూసి వెళ్ళారు.

ఆమె అట్లాగే కిటికీలోంచి అనంతంలోకి చూస్తూ ఉంది. నేను గది లోపలికి వెళ్ళాను. మనిషి కదులుతున్న స్పర్శ. కిటికీలోంచి బయటకు చూస్తున్నట్లు, లేచి టేబుల్‌పై కూర్చుని ఏదో బొమ్మ వేస్తున్నట్లు, లేదా మరణంలాంటి ఒక భంగిమలో అట్లా చాలాసేపు పడి ఉన్నట్లు - అక్కడో మనిషి, నిజంగా అశరీరంగా ఉన్నట్లు తోచింది. గదిలో దేన్నీ ముట్టుకోవాలనిపించలేదు.

టేబుల్‌పై 'ఏన్ ఎజెండా ఫర్ సర్వైవల్' అనే పుస్తకం ఉంది. పుస్తకాన్ని తెరిస్తే, చాలాచోట్ల అండర్‌లైన్ చేసినట్లుగా ఉంది. పుస్తకం మూసి బయటకు వచ్చాను.

"ఎమ్మెస్‌కు ఏం చెప్పమంటారు?" బయటకు వస్తూ అడిగాను.

"మా నాన్న పునరుత్థానంపై నాకు నమ్మకముంది. అంతవరకు పెళ్ళి సాధ్యం కాదని చెప్పండి" అంది. దిమ్మెరపోయాను. ఆమె సీరియస్‌గానే చెబుతోంది.

క్షణంసేపు ఆగి, "లోకేష్ పత్రికను తిరిగి ప్రారంభించాలి. యుద్ధం పూర్తి కాలేదు కదా" అని దీర్ఘంగా నిట్టూర్చి, "సెలవు" అంది.

లేచి బయటకు నడిచాను. "గుడ్‌బై" అంటూ సన్నగా నవ్వింది.

ఆ నవ్వునట్లాగే గుప్పెటలో దాచుకొని కిందకు నడిచాను.

గుప్పెట తెరిచి, ఆ నవ్వునట్లాగే చూసుకొంటూ రోడ్డుపైకి వచ్చాను. నల్లమబ్బు గురించి ఆరాటం మళ్ళీ మొదలైంది.

రోడ్డుపై సైబర్ కేఫ్ అంటూ కనబడి, నల్లమబ్బు గురించి అధికారిక వివరణ తెలుసుకోవాలనిపించి, వాతావరణ సంస్థ వాళ్ళు ఇచ్చిన అడ్రస్ కార్డుతో సహా అందులోకి ప్రవేశించాను.

ఇంటర్‌నెట్ కనెక్ట్ చేసి, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.నల్లమబ్బు.కామ్ అనే వెబ్‌సైట్ ఓపెన్ చేశాను.

మానిటర్‌పై నల్లని మబ్బు తునక కనబడి, అది మెల్లమెల్లగా పెరుగుతూ బ్రహ్మాండమైన మబ్బులా రూపొంది, చూస్తుంటే భయం కలిగేలా కనబడి మొత్తం ప్రపంచాన్నే కబళించబోయేలా ఉందనిపించి, క్రమంగా మానిటర్ లోంచి బయటకు వస్తున్నట్లుగా అనిపించసాగింది. మౌస్ సాయంతో 'ఇన్‌ఫో' అనే చోట నొక్కాను. ఇన్‌ఫర్మేషన్, వివరాలు, వివరణలు ఏముంటాయో చూద్దామని.

"చలికాలం, ఒక మేఘం, అంతే" అనే అక్షరాలు స్క్రీన్‌పై మెరవసాగాయి.

*- ఇండియా టుడే వార్షిక సాహిత్య సంచిక, 2000*